# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

15 హైదరాబాద్, మంగళవారం 26 మార్చి 2024 | HYDERABAD




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌తో హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్



ఓఆర్ఆర్ సైకిల్ ట్రాక్ ప్రాజెక్టులోని నార్సింగి హబ్‌లో ఏర్పాటు చేసిన అద్దెకు ఇచ్చే సైకిళ్లు

# సేవా మూర్తి.. మన శ్రీనన్న

## హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్

### ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

అబిడ్స్, మార్చి 25 : హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ టికెట్‌ను ఆశించిన గడ్డం శ్రీనివాస్ యాదవ్‌కు టికెట్ లభించకపోవడంతో పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి ఎంపిక చేశారు. ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, పార్టీ ప్రధాన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

**నియోజకవర్గం పేరు :** హైదరాబాద్ పార్లమెంట్
**పేరు :** గడ్డం శ్రీనివాస్ యాదవ్
**వయస్సు :** 56 సంవత్సరాలు
**విద్యార్హతలు :** బీకాం
**కుటుంబ నేపథ్యం :** భార్య స్వర్ణలత యాదవ్, కూతురు డాక్టర్ గడ్డం స్నేహ యాదవ్, కుమారుడు న్యాయవాది గడ్డం గగన్ యాదవ్.
**వృత్తి :** విద్యా సంస్థల నిర్వాహణ, జంట నగరాల్లోని 17 హైందవి గ్రూప్ ఆఫ్ కాలేజీలకు చైర్మన్, శ్రీ హిందూ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్

**రాజకీయ నేపథ్యం:** ప్రస్తుతం గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులుగా కొనసాగుతున్నారు. 1989లో విద్యార్థి జీవితం నుంచి ఆయన రాజకీయాలకు ఆకర్శితుడై ఎన్ఎస్‌యూఐలో చేరారు. ఎన్ఎస్‌యూఐ నగర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఆలిండియా కార్యదర్శిగా కొనసాగారు. క్యాంపస్ ఇన్‌చార్జిగా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఆలిండియా యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా కొనసాగారు. 2006 సంవత్సరంలో నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులై 2011 సంవత్సరం వరకు కొనసాగారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2015 సంవత్సరంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయన తన తండ్రి గడ్డం గంగాధర్ యాదవ్ పేరిట ఫౌండేషన్‌ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. కరోనా సమయంలో వేలాది కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ పట్టారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో బస్తీలలో బస్తీబాట చేపట్టి ఆయా ప్రాంతాలలో ఆర్థిక సమస్యలతో చదువుకోలేని విద్యార్థిని, విద్యార్థులను గుర్తించి వారి పేర్లను నమోదు చేసుకున్నారు. గత విద్యా సంవత్సరంలో ఉచితంగా విద్యా బోధన చేసేందుకు గాను తన కళాశాలలలో అవకాశం కల్పించారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా ఆయా బస్తీలలోని ప్రజల సమస్యలను తెలుసుకుని వారి సమస్యల పరిష్కారానికి పాటు పడ్డారు.

## ఘన విజయం సాధిస్తా..

### గడ్డం శ్రీనివాస్ యాదవ్



రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఇంటింటా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలిపి వారి సహకారంతో విజయం సాధిస్తానని అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక పోతున్నదని, దీంతో ప్రజలు తిరిగి బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను చేపట్టారని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీలు తమ పార్టీపై కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ప్రజల మద్దతుతో ఘన విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

# అధికారమే ప్రదానం



పార్టీ ఏదైతేనేం.. అధికారమే ప్రదానం!

నాడు ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇదే తీరు

- పీజేఆర్ అనుచరుడిగా ఎదిగి.. పీజేఆర్‌కే వెన్నుపోటు
- నాగేందర్ అభ్యర్థిత్వంపై రగులుతున్న నగర కాంగ్రెస్
- మూడు నెలల ముందే గులాబీ కండువాతో ప్రచారం
- ఇప్పుడు కాంగ్రెస్ తరపున ఓట్లడుగుతున్న జంపింగ్ కింగ్

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : ఊసరవెల్లి.. ప్రాణ రక్షణ కోసం రంగులు మారుస్తుంటుంది. కానీ.. కొందరు నాయకులు అధికారం కోసం జెండాలు మారుస్తారు. ఊసరవెల్లి రంగులు మార్చేందుకైనా కొంత సమయం పడుతుందేమోగానీ! సదరు నాయకుడు ఓట్లేసిన జనం వేలికి సిరా గుర్తు చెరిగిపోకముందే కండువా మార్చేస్తాడు. ఇందులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వీరతాడు వేయొచ్చు. ఇప్పుడే కాదు.. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఈ హైదరాబాద్ రాజకీయ నాయకుడి తీరు రాష్ట్రవ్యాప్తంగా అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అదే సీను మరోసారి పునరావృతం చేస్తూ.. కేవలం మూడు నెలల కిందటే గులాబీ కండువాతో ఓట్లు అడుక్కున్న చోట మరో పార్టీ కండువాతో జనం మధ్యలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. నవ్విపోదరుగాక.. నాకేటి సిగ్గు అన్నట్లు జంపింగ్ జపాంగ్‌లకే ఆదర్శంగా నిలిచారు. మరి.. నేతకు లేకున్నా! ఏండ్ల తరబడి పార్టీ జెండా మోస్తున్న నికార్సయిన కార్యకర్తలకు ఉంటుంది కదా.. అందుకే సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా దానం నాగేందర్ ఎంపికపై నగర కాంగ్రెస్ కస్సుమంటుంది. ముఖ్యంగా సదరు దానం జంపింగ్ అనేది ఒంటరిగా ఉండదు కదా.. చుట్టూ ఉండే తన అనుచరులు కూడా వెంట ఉండటంతో తాము ప్రతిపక్షంలో ఉన్నంతకాలం అధికారాన్ని అనుభవించిన వాళ్లు ఇప్పుడు తమకు అవకాశాలు వచ్చే సమయంలో గద్దలా వచ్చి అవకాశాలను తన్నుకుపోతున్నారంటూ రగిలిపోతున్నారు.

**రాజకీయ నాయకులు పార్టీలు మారడం సహజం.** కానీ ఈ జంపింగ్‌లోనూ కొందరు తమ ప్రత్యేకతను చాటుకుంటారు. ఆ ఆనవాయితీని కొనసాగిస్తారు కూడా. ఇందుకు నగర రాజకీయ నాయకుడు దానం నాగేందర్‌కు ఓ ప్రత్యేకత ఉందంటూ రాజకీయ పరిశీలకులు చురకలు అంటిస్తున్నారు. గులాబీ కండువా మీద ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ రాత్రికి రాత్రే కండువా మార్చుకున్న సందర్భంగా అతడి జంపింగ్ టాలెంట్ చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇదే తరహా భారీ జంపింగ్ ఆయన ఖాతాలో ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. పీజేఆర్ అనుచరుడిగా నగర రాజకీయాల్లోకి వచ్చిన దానం నాగేందర్ చివరకు ఆయన బతికి ఉన్నంత కాలం కాంగ్రెస్ పార్టీలోనే పీజేఆర్ ప్రత్యర్థి అయిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పంచన చేరి ఆయన్ని మానసిక క్షోభకు కారణమయ్యాడనేది సీనియర్ నేతల విశ్లేషణ. అంతేకాదు ఇప్పుడు పీజేఆర్ వారసుల అవకాశాలను కూడా కొల్లగొట్టడంలో ముందు వరుసలో ఉన్నారు. కాగా తొలిసారిగా ఉమ్మడి ఏపీలో 1994లో ఆసిఫ్‌నగర్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం.. ఆపై 1999 ఎన్నికల్లోనూ అదే నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహించారు. 2004లో కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోవడంతో తొలిసారిగా తెలుగుదేశం పార్టీలోకి జంప్ చేశారు. ఆసిఫ్‌నగర్ నుంచి ఆయన గెలవగా.. అప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అరెరె.. టీడీపీ గెలుస్తుందనుకుంటే కాంగ్రెస్ గెలిచింది కదా! అనుకొని వెంటనే టీడీపీ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. వెను వెంటనే కాంగ్రెస్ కండువా కప్పుకొని ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరపున నిలబడ్డారు. కానీ దానం ఒకటి తలిస్తే.. దైవం మరొకటి తలిచింది. ఆ ఉప ఎన్నికలో దానంకు పరాభవం తప్పలేదు. దీంతో అధికార ఎమ్మెల్యేగా దర్పం ఒలకబోద్దామనుకున్న నాగేందర్‌కు ఉన్న ఎమ్మెల్యే పదవి కూడా ఊడిపోవడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయాల్లో సంచలనమైంది.

### తెలంగాణ రాష్ట్రంలో కుదురుగా ఉన్నదెప్పుడు?

ఉమ్మడి రాష్ట్రంలోనే 2014 ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన దానం నాగేందర్ ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ గెలుస్తుందనే గంపెడాశతో పోటీ చేసి, నిరాశ ఎదురుకావడంతో ఏం చేయాలో దిక్కు తోచలేదు. దీంతో 2018 ఎన్నికల సమయానికి మరోసారి జంప్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ (అప్పుడు టీఆర్ఎస్) పార్టీలోకి వచ్చి ఖైరతాబాద్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నందున ఈ ఐదేండ్లు కుదురుగానే ఉన్నారు. గత ఏడాది చివర్లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి బరిలోకి దిగి మళ్లీ గెలిచారు. కానీ ఈసారి బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే.. దానం నాగేందర్ తనలోని జంపింగ్ టాలెంట్‌కు మళ్లీ పని కల్పించారు. పరస్పర ప్రయోజనం అనే ప్రాతిపదికన రాత్రికి రాత్రే గులాబీ కండువాను వీడగా.. సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థిగా దుర్భిణీ వేసినా ఎవరూ దొరకకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఆయనకు కండువా కప్పి తమ పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. అభ్యర్థి లోటు తీరిందనేది కాంగ్రెస్ అనివార్యత.. ఓడిపోయినా ఎమ్మెల్యేగా అధికార పార్టీకి అంటకాగుతూ ఉండొచ్చనేది దానం అవకాశవాదం. అయితే ఉమ్మడి ఏపీలో టీడీపీ తరపున గెలిచి నెలల వ్యవధిలోనే ఉప ఎన్నికలో అధికార పార్టీ తరపున మళ్లీ పోటీ చేసి ఓడిపోయిన రికార్డు నెలకొల్పిన దానం నాగేందర్.. ఇప్పుడు అదే తరహాలో బీఆర్ఎస్ తరపున గెలిచి మూడు నెలల వ్యవధిలోనే సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి అధికార కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తూ తన పాత రికార్డుకు సరికొత్త శోభను తెచ్చారు. మరి.. మూడు నెలల కిందటే గులాబీ కండువాతో ఓట్లు అడిగిన దానం ఇప్పుడు కాంగ్రెస్ కండువాతో మళ్లీ ఓట్లు అడుగుతుండటాన్ని ఓటర్లు ఎలా తీసుకుంటారనేది వేచి చూడాల్సిందే.

# ఓఆర్ఆర్ సైకిల్ ట్రాక్‌పై అద్దె సైకిళ్లు

### నార్సింగి హబ్‌లో 200 సైకిళ్లు - గంటకు రూ.50 అద్దె

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : ఔటర్ రింగు రోడ్డు సోలార్ రూఫ్ టాప్ సైకిల్ ట్రాక్ మీద సైకిళ్లు దూసుకుపోతున్నాయి. నగరంలో సైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు వెంబడి 24 కి.మీ మేర అంతర్జాతీయ ప్రమాణాలతో సోలార్ రూఫ్ టాప్ సైకిల్ ట్రాక్‌ను నిర్మించారు. అంతేకాకుండా ప్రత్యేక చొరవ తీసుకొని సైకిల్ ట్రాక్ మీద సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతో పాటు దాని వెలుతురులో హాయిగా సైక్లింగ్ చేసుకునే సైక్లింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. సొంత సైకిళ్లు ఉన్న వారు నేరుగా ఈ ట్రాక్‌పై సైక్లింగ్ చేసే అవకాశం ఉండగా, లేని వారి కోసం అద్దెకు సైకిల్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మొదటి సైకిల్ స్టేషన్‌ను నార్సింగి హబ్‌లో ఏర్పాటు చేసి సుమారు 200 సైకిళ్లను అందుబాటులో ఉంచగా, అందులో 40కి పైగా ఎలక్ట్రిక్ సైకిళ్లు సైతం ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. అద్దెకు ఇచ్చే సైకిల్‌కు గంటలకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో సైకిల్ స్టేషన్ల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారు. 24కి.మీ ఓఆర్ఆర్ సైకిల్ ట్రాక్‌పై 4 చోట్ల సైకిల్ స్టేషన్‌లను ఏర్పాటు చేయగా, అందులో తెలంగాణ పోలీస్ అకాడమీ జంక్షన్, నానక్‌రాంగూడ, నార్సింగి, కొల్లూరు ప్రాంతాలను సైకిల్ స్టేషన్ల కోసం ఎంపిక చేసి అక్కడ మౌలిక వసతులు కల్పించారు. ప్రస్తుతం నార్సింగి హబ్‌లో సైకిళ్లు అద్దెకు అందుబాటులో ఉండగా, త్వరలోనే మిగతా ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.



### హరేకృష్ణ ఆలయంలో గౌరపూర్ణిమ వేడుకలు

బంజారాహిల్స్, మార్చి 25 : శ్రీ చైతన్య మహాప్రభు అవతరణ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నం.12లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో సోమవారం గౌరపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్యచంద్ర గౌరదాస, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



రంగుల కేళీ.. సంబురంగా హోలీ


హైదరాబాద్ నగరంలో సోమవారం హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచే చిన్నా.. పెద్దా అంతా కలిసి ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నగరం రంగులమయంగా మారింది.

దూకుడు పెంచిన అభ్యర్థులు

సందడిగా సన్నాహక సమావేశాలు

కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ

బీఆర్ఎస్ శ్రేణుల్లో సార్వత్రిక జోష్




# గెలుపే లక్ష్యంగా..

## అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన అధినేత కేసీఆర్

### నేడు కేటీఆర్ సమావేశం

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నేతలతో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకున్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలపై కేటీఆర్ దిశానిర్ధేశం చేయనున్నారు.

*బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్ని పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. గ్రేటర్‌కు నాలుగు పార్లమెంటు స్థానాలతో అనుబంధం ఉండగా.. సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు దూకుడు పెంచారు. పలు నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు ఇప్పటికే మొదలవ్వగా.. ఎన్నికల నోటిఫికేషన్ నాటికి అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తయ్యేలా కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీకి, బీఆర్ఎస్ మధ్య ఓట్ల శాతం స్వల్పంగానే తేడా ఉండటం.. కాంగ్రెస్, బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడం బీఆర్ఎస్‌కు అనుకూలిస్తాయని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.*

*- సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ) :*

### రంగంలోకి బలమైన అభ్యర్థులు..

బీఆర్ఎస్ అధినేత వ్యూహాత్మకంగా ఎంపీ స్థానాలకు బలమైన అభ్యర్థులను రంగంలోకి దించారు. చేవెళ్ల స్థానం నుంచి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజు, సికింద్రాబాద్ నుంచి పద్మారావు గౌడ్, మల్కాజిగిరి నుంచి రాగిడి లక్ష్మారెడ్డి, హైదరాబాద్ నుంచి గడ్డం శ్రీనివాస్ యాదవ్‌లను అభ్యర్థులుగా ప్రకటించారు. గట్టి పోటీనిచ్చే అభ్యర్థులను ప్రకటించడంతో పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతున్నది. వ్యూహాత్మకంగా చేవెళ్ల, హైదరాబాద్, సికింద్రాబాద్ స్థానాలకు బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ప్రకటించి ప్రత్యర్థులకు సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లోని అన్ని స్థానాలను గెలుచుకుని బీఆర్ఎస్ సత్తా చాటింది. అదే ఉత్సాహంతో పార్లమెంటు ఎన్నికల్లోనూ మెజార్టీ ఎంపీ స్థానాలను గెలుచుకునేలా గులాబీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ప్రస్తుత ఎన్నికల్లో అనుకూలంగా మలుచుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం.. అన్ని వర్గాల సంక్షేమాన్ని సైతం విస్మరించడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయి.

### సమావేశాలతో క్యాడర్‌ను సన్నద్ధం చేస్తూ..

పార్లమెంటు ఎన్నికల్లో అన్ని పార్టీల కంటే ముందుగానే బీఆర్ఎస్ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తున్నది. పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో ఒక విడుత అన్ని నియోజకవర్గాల నేతలతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో చేసిన దిశానిర్ధేశం మేరకు గ్రేటర్‌కు చెందిన నేతలు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించి పార్టీ అభ్యర్థుల గెలుపునకు పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో సమావేశాలను నిర్వహిస్తున్నారు. చేవెళ్ల పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేసేందుకు ఇప్పటికే మహేశ్వరం, పరిగి నియోజకవర్గాల్లో సమావేశాలను నిర్వహించారు. ఈ నెల 26న తాండూరులో, 27న రాజేంద్రనగర్‌లో, 30న శేరిలింగంపల్లిలో, ఏప్రిల్ 1న చేవెళ్లలో, 3న వికారాబాద్‌లో సమావేశాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సమావేశాలు పార్టీ క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత మరోసారి సమావేశాలు నిర్వహించేలా వ్యూహ రచన చేస్తున్నారు. అభ్యర్థులు సైతం ముఖ్య నేతలు, పార్టీ కార్యకర్తలను కలిసి గెలుపునకు కృషి చేయాలని కోరుతున్నారు. కేసీఆర్‌తో భారీ బహిరంగ సభల నిర్వహణకు సంబంధించి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేస్తుండటంతోపాటు రోడ్ షోలను నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు. అదేవిధంగా మంగళవారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సమావేశం తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన నిర్వహించి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్ధేశం చేయనున్నారు.